

www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY




సంపుటి: 01 | సంచిక: 235 | హైదరాబాద్ | బుధవారం | 17-12-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## మహాత్ముడిని అవమానిస్తారా?

ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సరికాదు
గ్రామీణ ప్రజలకు అన్యాయం చేస్తున్న కేంద్రం
యువతకు ఉద్యోగాలు కల్పించడం లేదు
గ్రామీణ పేదల పెట్టకూడా కొడుతున్నారు
పేదలంటే బీజేపీకి మొదటి నుంచి చిన్నచూపే
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ, (సిద్దిపేట పవర్):**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహాత్మాగాంధీ ఆదర్శాలను అవమానించడమే లక్ష్యంగా కేంద్రం ఈ చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. దేశంలో ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైన మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేసిందని, ఇప్పుడు గ్రామీణ ప్రజల జీవనాధారమైన ఉపాధినీ కబళించేందుకు ప్రయత్నిస్తోందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఈ ప్రజావ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఐక్యంగా ర్యాలీగా పార్లమెంటు వరకు వెళ్లి నిరసన తెలియజేస్తాయని ..మిగతా 3లో



## లీక్ చేసిందెవరు?

మోదీ తెలంగాణ పార్టీ బలోపేతంపై సూచనలు చేశారు
సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని సూచించారు
సొంతపార్టీ ఎంపీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

ప్రధాని నరేంద్ర మోదీతో ఇటీవల తెలంగాణ బీజేపీ ఎంపీలతో జరిగిన సమావేశానికి సంబంధించిన అంశాలు లీక్ కావడంపై కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో చర్చించిన విషయాలను బయటకు వెల్లడించవద్దని ప్రధాని స్పష్టంగా సూచించారని, అయినప్పటికీ ఆ వివరాలు మీడియాలోకి రావడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆ అంశాలను బయటకు చెప్పిన వారు ఎవరో తెలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆ సమావేశంలో ప్రధాని మోదీ పార్టీ బలోపేతంపై కీలక సూచనలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో మరింత యాక్టివ్‌గా ఉండాలని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రధాని కోరినట్లు చెప్పారు. తెలంగాణలో బీజేపీని మరింత ..మిగతా 2లో

## జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌పై రగడ

కౌన్సిల్ సమావేశంలో
బీజేపీ సభ్యుల నిరసన
డీలిమిటేషన్ కోసం
జీహెచ్ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం
డివిజన్ల పునర్విభజనను
వ్యతిరేకించిన బీజేపీ కార్యకర్తలు
తీవ్రమైన నిరసనల మధ్య
కౌన్సిల్ సమావేశం వాయిదా




02

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో భోగాపురం ఎయిర్‌పోర్టు

వచ్చే నెలలో ట్రయల్‌రన్ నిర్వహిస్తాం
వచ్చే ఏడాది జూన్ నాటికి
ప్రారంభించాలని కసరత్తు చేస్తున్నాం
ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ
గుర్తింపు తీసుకొస్తాం
కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



03



# తెలంగాణకు నిధులివ్వండి

విద్యాభివృద్ధికి సహకరించండి
తెలంగాణకు ఐఐఎం మంజూరు చేయండి
ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్
స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం
వాటికి 30 వేల
కోట్ల రూపాయలు ఖర్చవుతుంది
ఆ మొత్తాన్ని ఎఫ్ఆర్‌బీఎం నుంచి
మినహాయించండి
కేంద్రానికి ముఖ్యమంత్రి
రేవంత్ రెడ్డి విజ్ఞాపనలు

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్ర విద్యా రంగ అభివృద్ధి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్టు, ఐఐఎం స్థాపన వంటి కీలక అంశాలపై చర్చించారు. ముందుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను ఆమెకు అందజేశారు. రాష్ట్రంలో 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటిగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం, ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి సుమారు రూ.30 వేల కోట్లు అవసరమవుతుందని, ఈ మొత్తానికి తీసుకునే రుణాలను ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) పరిధి నుంచి మినహాయించాలని ..మిగతా 2లో

## పంచాయతీ ఎన్నికల్లో పైచేయి సాధించాం

పల్లె పల్లెనా కాంగ్రెస్
ఆధిపత్యం కనబరిచింది
బీఆర్ఎస్ తప్పుడు
ప్రచారాన్ని జనం నమ్మలేదు
ఇందిరమ్మ ఇండ్లపై
తప్పుడు ప్రచారం చేశారు
బీఆర్ఎస్ పాలనలో
ఒక్క ఇల్లు అయినా ఇచ్చారా?
పంచాయతీ రాజ్ శాఖ
మంత్రి సీతక్క వ్యాఖ్యలు



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటివరకు 8,566 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ..మిగతా 2లో

## సర్పంచులు గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి

మధిరలో నూతన సర్పంచులకు
డిప్యూటీ సీఎం సన్మానం
గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న భట్టి
2047 విజన్‌తో తెలంగాణ నిర్మాణం
సంక్షేమం,
పెట్టుబడులపై ప్రభుత్వ ఫోకస్



02



## పశ్చిమబెంగాల్ క్రీడాశాఖ మంత్రి అరూప్ బిస్వాస్ రాజీనామా

సీఎం మమతా బెనర్జీ ఆమోదం
మెస్సీ పర్యటనలో
గందరగోళమే కారణం
క్రీడా శాఖ బాధ్యతలు
మమత చేతికి

02

## యూరియా బ్లాక్ మార్కెట్‌కు చెక్.. కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్

ఇకపై యాప్‌లోనే యూరియా
యూరియా పక్కదారి
పట్టకుండా సర్కార్ కొత్త ప్లాన్
పంటల సర్వేకు జర్మనీ
కంపెనీతో తుది దశలో చర్చలు



02

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికార మదంతో వ్యవహరిస్తున్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధికార
గర్వం పెరిగిపోయిందన్న కేటీఆర్
ప్రభుత్వ నిధులు, ఇందిరమ్మ ఇళ్లు
నేతల సొంత ఆస్తి కాదని స్పష్టీకరణ
యూరియా కొరతను
కప్పిపుచ్చుకునేందుకే కొత్త యాప్ డ్రామా
బీసీ రిజర్వేషన్లు తగ్గించి రేవంత్ రెడ్డి
మోసం చేశారని విమర్శలు
మరో రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం
పడిపోవడం ఖాయం అని వ్యాఖ్యలు



03

### పశ్చిమబెంగాల్ క్రీడాశాఖ మంత్రి

## అరూప్ బిస్వాస్ రాజీనామా

- సీఎం మమతా బెనర్జీ ఆమోదం
- మెస్సీ పర్యటనలో గందరగోళమే కారణం
- క్రీడా శాఖ బాధ్యతలు మమత చేదికి



**కోల్‌కతా, (సిద్దిపేట పవర్):**

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటనలో భాగంగా 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (GOAT) ఇండియా టూర్ 2025' కార్యక్రమం కోల్‌కతాలో గందరగోళంగా మారిన సంఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. డిసెంబర్ 13న సాల్ట్ లేక్ స్టేడియం (వివేకానంద యువ భారతి క్రీడంగణం)లో జరిగిన ఈ కార్యక్రమంలో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో మెస్సీని సరిగ్గా చూడలేక నిరాశకు గురైన అభిమానులు విధ్వంసానికి దిగారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ క్రీడా శాఖ మంత్రి అరూప్ బిస్వాస్ మంగళవారం (డిసెంబర్ 16) రాజీనామా చేశారు. వెంటనే ఆ రాజీనామాను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆమోదించారు. ప్రస్తుతం క్రీడా శాఖ బాధ్యతలను మమతా స్వయంగా చేపట్టారు.

అరూప్ బిస్వాస్ చేతితో రాసిన లేఖలో... "డిసెంబర్ 13న యువ భారతి క్రీడంగణంలో మెస్సీ సందర్శన సందర్భంగా ఏర్పడిన పరిస్థితులపై మీరు ఇప్పటికే విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. నిష్పక్షపాత దర్యాప్తు జరిగేందుకు నేను క్రీడా మంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నాను" అని పేర్కొన్నారు. టీఎంసీ నాయకుడు కునాల్ ఘోష్ ఈ లేఖను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అరూప్ బిస్వాస్ మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా, టీఎంసీ సీనియర్ నేతగా పేరు పొందిన వ్యక్తి. ఈ రాజీనామాతో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మరింత వేడెక్కాయి.

**ఘటన ఏమిటి ?**

మెస్సీ GOAT ఇండియా టూర్‌లో మొదటి దశగా డిసెంబర్ 13న కోల్‌కతా చేరుకున్నారు. సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మెస్సీ కేవలం 2022 నిమిషాలు మాత్రమే ఉన్నారు. ఆయన చుట్టూ మంత్రి అరూప్ బిస్వాస్, ఇతర ప్రముఖులు, వీఐపీలు గుమికూడడంతో భారీ మొత్తంలో టికెట్లు కొన్న అభిమానులకు మెస్సీ సరిగా కనిపించలేదు. దీంతో నిరాశకు గురైన వేలాది మంది అభిమానులు స్టేడియం సీట్లు పీకి పారేశారు, బాటిళ్లు విసిరారు, గేట్లు ఎక్కే ప్రయత్నం చేశారు. సుమారు రూ.2 కోట్ల విలువైన స్టేడియం ఆస్తులు ధ్వంసమయ్యాయి. పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. ఈవెంట్ నిర్వాహకుడు సతద్రు దత్తాను పోలీసులు అరెస్టు చేశారు. 14 రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు పంపించింది. మంత్రి అరూప్ బిస్వాస్ మెస్సీతో సెల్ఫీలు తీసుకోవడం, తన కుటుంబ సభ్యులతో ఫొటోలు తీయించడం అభిమానుల్లో మరింత ఆగ్రహాన్ని రేపింది. "మెస్సీని చూడాలని వచ్చాం... కానీ అరూప్ బిస్వాస్ మాత్రమే కనిపించాడు" అంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి.

**మమతా బెనర్జీ స్పందన**

ఘటన జరిగిన రోజే మమతా బెనర్జీ మెస్సీకి, అభిమానులకు క్షమాపణలు చెప్పారు. "మెస్సీకి, క్రీడా ప్రేమికులకు నేను హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నాను. ఈ దుర్ఘటనపై నేను లోతుగా బాధపడ్డాను" అని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. విచారణ కోసం రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే డీజీపీ రాజీవ్ కుమార్, బిధన్‌నగర్ సీపీ ముఖేష్ కుమార్, యువజన వ్యవహారాలు & క్రీడా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేష్ కుమార్ సిన్హాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డీసీపీ అనీష్ సర్కార్‌పై శాఖాపరమైన చర్యలు ప్రారంభించారు.

**రాజకీయ దుమారం**

ఈ ఘటనపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. "మమతా బెనర్జీకి సిగ్గు లేదా? ప్రపంచ స్థాయి అవమానం" అంటూ ప్రతిపక్ష నేత సువేందు అధికారి మమతా రాజీనామా డిమాండ్ చేశారు. టికెట్ ధరలు తిరిగి ఇవ్వాలని, నిర్వాహకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మొత్తంగా మెస్సీ పర్యటనలో కోల్‌కతా ఎపిసోడ్ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి పెద్ద మచ్చగా మిగిలిపోయింది. విచారణ ఫలితాలు ఏమవుతాయో చూడాలి.

## పంచాయతీ ఎన్నికల్లో పైచేయి సాధించాం

**మొదటిపేజీ తరువాయి**



తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె... ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సహచర మంత్రుల నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో తన బలాన్ని చాటిందని పేర్కొన్నారు.

ఈ ఎన్నికలు గ్రామాలకు పూర్తిస్థాయి నిధులు అందేలా చేయడమే లక్ష్యంగా నిర్వహించినట్లు సీతక్క వివరించారు. అలాగే బీసీలకు కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వంతో పోరాటం కొనసాగుతూనే ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర విమర్శలు గుప్పించిన మంత్రి సీతక్క... సమ్మక్కసారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు. ''రాళ్లు కాదు... రాతి శిలలపై చెక్కిన చరిత్రే ఆదివాసీల అస్థిత్వానికి, సంస్కృతికి నిదర్శనం. మా ఆదివాసీ దేవతల జోలికి వచ్చినా, మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేసినా ఊరుకునేది లేదు'' అని ఆమె గట్టిగా హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై బీఆర్ఎస్ నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించిన సీతక్క... పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లు కూడా ఇవ్వని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే వేలాది ఇళ్లను పేదలకు అందజేసిందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత చీరలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద విద్యార్థులకు గ్రూప్1, గ్రూప్2 ఉద్యోగాలు రావడం కొందరికి కళ్లమంటగా మారిందని ఎద్దేవా చేశారు. తాడ్వాయి ప్రాంతంలో ఆదివాసీ మహిళ సర్పంచ్‌గా గెలిచినందుకు భూములు లాగేసుకుంటారని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం నీచమైన రాజకీయమని సీతక్క తీవ్రంగా ఖండించారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, మహిళల శక్తివంతం చేయడం, ఆదివాసీల ఆత్మగౌరవం కాపాడటంపై దృష్టి సారించిన నేపథ్యంలో మంత్రి సీతక్క వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించాయి. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని తెరుస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణకు నిధులివ్వండి

**మొదటిపేజీ తరువాయి**

విజ్ఞప్తి చేశారు. విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధిలో పెట్టుబడిగా పరిగణించాలని కోరారు.

ఈ స్కూల్స్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు (రాష్ట్ర విద్యార్థుల్లో దాదాపు 90 శాతం) కార్పొరేట్ స్థాయి విద్య, పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం వివరించారు. ప్రతి స్కూల్‌లో 2,560 మంది విద్యార్థుల సామర్థ్యం ఉండనుంది. మొత్తంగా 2.7 లక్షల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా, 4 లక్షల మందికి పరోక్షంగా లాభం చేకూరనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రశంసించిన నిర్మలా సీతారామన్... ప్రత్యేక ప్రయోజన సంస్థ (స్పెషల్ పర్పస్ వెహికల్ ఎస్‌పీవీ) వివరాలు పంపాలని, వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని సూచించారు.

అనంతరం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయిన సీఎం రేవంత్... హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐఐఎం కోసం హైదరాబాద్ పరిధిలో 200 ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని, అనుమతులు ఇస్తే వెంటనే తరగతులు ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు (కేంద్రీయ విద్యాలయాలు), 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కోరారు.

హైదరాబాద్‌కు దేశవ్యాప్తంగా రోడ్డు, రైలు, విమాన మార్గాల ద్వారా అత్యుత్తమ కనెక్టివిటీ ఉందని, దేశంలోని పలు రంగాల్లో ప్రముఖులను ఇచ్చిన నగరమిదని సీఎం గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రానికి ఒక ఐఐఎం మంజూరు చేసే విధానం ఉన్న నేపథ్యంలో తెలంగాణకు మంజూరు చేయాలని నొక్కి చెప్పారు. మొత్తంగా రాష్ట్ర విద్యా రంగాన్ని బలోపేతం చేయడం, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి సారించిన ఈ భేటీలు ప్రాధాన్యత సంతరించాయి. రాష్ట్ర అభివృద్ధి, మానవ వనరుల పెంపుదలకు కేంద్ర సహకారం అవసరమన్న సీఎం రేవంత్ రెడ్డి వైఖరి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



## లీక్ చేసిందెవరు?

**మొదటిపేజీ తరువాయి**

బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారని వివరించారు. దక్షిణ భారతదేశం నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉప రాష్ట్రపతులు ఎన్నికయ్యారని గుర్తు చేస్తూ, బీజేపీలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్ష స్థాయి వరకు ఎదగడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని ప్రధాని పేర్కొన్నట్లు తెలిపారు.

ఇక రైల్వే శాఖకు సంబంధించిన అంశాలపై కూడా కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయినట్లు వెల్లడించారు. ఆ సమావేశంలో తెలంగాణలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రంలో అమృత్ భారత్ పథకం కింద 42 రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే రూ.400 కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రెండో దశను పొడిగించే అంశంపై కూడా రైల్వే మంత్రితో మాట్లాడినట్లు వెల్లడించారు. కొమరవెల్లి మల్లన్న రైల్వే స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే మంత్రిని కోరినట్లు చెప్పారు.



ఇదిలా ఉండగా, ఓటు చోరీ అంటూ నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ అనైతికంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఏ అంశంపై ఎలా మాట్లాడాలనే అవగాహన కూడా ఆయనకు లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉండటం దేశానికి దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

### యూరియా బ్లాక్ మార్కెట్‌కు చెక్..

## కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్

- ఇకపై యాప్‌లోనే యూరియా
- యూరియా పక్కదారి పట్టకుండా సర్కార్ కొత్త ప్లాన్
- పంటల సర్వేకు జర్మనీ కంపెనీతో తుది దశలో చర్చలు

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో యూరియా కొనుగోళ్ల కోసం త్వరలోనే ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. యూరియా అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు, పరిశ్రమలకు తరలిపోకుండా నేరుగా రైతులకే అందేలా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మీడియాతో ఈరోజు నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ఈ కీలక విషయాలను పంచుకున్నారు.

పత్తి అమ్మకాల కోసం ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్' యాప్ వంద శాతం విజయవంతమైందని, అదే స్ఫూర్తితో యూరియా యాప్‌ను రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ యాప్‌పై రైతు వేదికల ద్వారా రైతుల అభిప్రాయాలు సేకరించామని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అన్నారు. స్లాట్ బుకింగ్ వంటి విషయాల్లో రైతులకు సహాయం అందించేందుకు రైతు వేదికల వద్ద ఏఈవోలు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. కొందరు కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అదే సమయంలో, పంటల సర్వే కోసం శాటిలైట్ టెక్నాలజీని వినియోగించేందుకు జర్మనీకి చెందిన ఒక సంస్థతో చర్చలు తుది దశలో ఉన్నాయని తుమ్మల తెలిపారు. ఈ ఒప్పందం ఖరారైతే, వాస్తవంగా పంట సాగు చేసిన భూమికే 'రైతు భరోసా' సహాయం అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. కొండలు, గుట్టల వంటి సాగు చేయని భూములకు భరోసా నిలిపివేసి, ఆ నిధులను ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు మళ్లిస్తే రైతులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై త్వరలో కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.



### సర్పంచులు గ్రామాల్లో రాజకీయాలకు

## అతీతంగా పనిచేయాలి

- మధిరలో నూతన సర్పంచులకు డిప్యూటీ సీఎం సన్మానం
- గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న భట్టి
- 2047 విజన్‌తో తెలంగాణ నిర్మాణం
- సంక్షేమం, పెట్టుబడులపై ప్రభుత్వ ఫోకస్

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**



ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులను డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవల మెరుగుదలపై సర్పంచులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించినట్లు చెప్పారు. 2047 కల్లా రాష్ట్రంలో ఒక లక్ష 30 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 5 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 131 గ్రామపంచాయతీలకు గాను 90 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులు గెలవడం చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 20 వేల కోట్ల రూపాయలతో వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రైతులకు 9 వేల కోట్ల రూపాయలతో రైతు భరోసా అందజేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.

## జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌పై రగడ

- కౌన్సిల్ సమావేశంలో బీజేపీ సభ్యుల నిరసన
- డీలిమిటేషన్ కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం
- డివిజన్ల పునర్విభజనను వ్యతిరేకించిన బీజేపీ కార్యకర్తలు
- తీవ్రమైన నిరసనల మధ్య కౌన్సిల్ సమావేశం వాయిదా




**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని విస్తరించి, డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచిన నేపథ్యంలో డివిజన్ల పునర్విభజన (డీలిమిటేషన్)పై తీవ్ర వివాదం నెలకొంది. మంగళవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించగా, బీజేపీ కార్పొరేటర్ల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. సమావేశం ప్రారంభమైన వెంటనే అధికారులు డివిజన్ల డీలిమిటేషన్ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను సభ ముందు ప్రవేశపెట్టారు. అయితే డివిజన్ల పునర్విభజనకు వ్యతిరేకంగా బీజేపీ కార్పొరేటర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభను తాత్కాలికంగా వాయిదా వేశారు. డీలిమిటేషన్‌పై వచ్చిన అభ్యంతరాలను సమగ్రంగా సేకరించి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. అంతకుముందు సమావేశంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), తలసాని శ్రీనివాస్ యాదవ్ (సనత్‌నగర్), ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, జనాభా నిష్పత్తి, భౌగోళిక సమతుల్యత, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకోలేదని వారు ఆరోపించారు. కొన్ని డివిజన్లలో ఓటర్ల సంఖ్య అసమానంగా ఉందని, మ్యాప్‌లు తప్పుడుగా ఉన్నాయని విమర్శలు గుప్పించారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భాజపా కార్పొరేటర్లు బహిరంగ నిరసన చేపట్టారు. "డివిజన్ చోరీ జరిగింది" అంటూ నినాదాలు చేస్తూ, జీహెచ్ఎంసీ విడుదల చేసిన మ్యాప్‌లు తప్పులతడకగా ఉన్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ గెజిట్ పత్రాలను చించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ శాస్త్రీయంగా జరగలేదని, పారదర్శకత లోపించిందని బీజేపీ నేతలు మండిపడ్డారు. ఈ డీలిమిటేషన్ ప్రక్రియపై ఇప్పటికే 2 వేలకుపైగా అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. భాజపాతోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కూడా ప్రక్రియలో పారదర్శకత లేదని, సంప్రదింపులు జరగలేదని ఆరోపిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలి 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేసిన తర్వాత ఈ పునర్విభజన చేపట్టారు. అయితే ఈ ప్రక్రియ రాజకీయ లబ్ధి కోసమే జరుగుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మొత్తంగా జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ అంశం రాజకీయంగా మరింత వేడెక్కింది. అభ్యంతరాలను పరిశీలించి ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది.

